క్లుప్తంగా

అందుబాటులో పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు

జైపూర్: మండల రైతులకు అందుబాటులో 60 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్ తెలిపారు. రైతులు ప్రధాన పంటలు వేసే ముందు పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనము, నత్రజని లభించి ఫలితంగా రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని, భూములు సారవంతం అవుతాయని, రైతులు పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు చల్లుకోవాలని తెలిపారు. 30 కిలోల బ్యాగు 60 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుందని రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జైపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–2025 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీరస్వామి తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో చేరేందుకు కళాశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచి ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు నార్ల మహేందర్, ఎం.వెంకటేష్, కొంతం రాజు, మగ్గిడి రాజశేఖర్, అరెందుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు అల్పాహారం, భోజనం

మంచిర్యాలటౌన్: దండేపల్లి మండలంలోని కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువలో ట్రాక్టర్ బోల్తాపడి తీవ్ర గాయాలతో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధిహామీ కూలీలకు కాంగ్రెస్ పట్టణ నాయకులు అండగా నిలిచారు. శనివారం ఉదయం అల్పాహారం అందించడంతో పాటు, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను వారు కోలుకునే వరకు అందిస్తామని, అధైర్యపడవద్దని, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో అండగా నిలుస్తున్నట్లు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

'ఆదివాసీలపై సైనిక దాడులు ఆపాలి'

పాతమంచిర్యాల: భారత ప్రభుత్వం ఆదివాసీలపై సైనిక దాడులు ఆపాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హత్య చేసిందని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామన్న, నాయకులు రమేష్, దేవన్న, సారయ్య, సురేందర్, చంద్రమౌళి, కలీం, సయ్యద్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలో గల మైత్రి యోగా ప్రకృతి చికిత్సా కేంద్రంలో క్రియేటివ్ కిడ్స్ సమ్మర్ క్యాంపులోని చిన్నారులకు షీటీం ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై శనివారం అవగాహన కల్పించారు. కానిస్టేబుల్‌లు శ్రవణ్ కుమార్, జ్యోతిలు షీ టీం ప్రాముఖ్యతను వివరించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏంటో వివరించి, అమ్మాయిలకు రక్షణ కోసం 63039 23700 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. మొబైల్‌ను పిల్లలు వినియోగించేటప్పుడు వచ్చిన లింక్‌లను ప్రెస్ చేయొద్దని, ఓటీపీలను పొరపాటుగా కూడా ఎవరితో చెప్పవద్దని సూచించారు.

చిత్తరాయి గుట్టలను సంరక్షించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ధర్మారం శివారులోని అటవీ ప్రాంతంలో గల చిత్తరాయి గుట్టలను, ఆదిమానవ కాలంనాటి చిత్రకూడ్యాలను సంరక్షించుకోవాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరిదని సందర్శకులు పిలుపునిచ్చారు. హాజీపూర్ గ్రామ పరిధిలోని ధర్మారం అటవీ ప్రాంతంలో శనివారం పలువురు సందర్శకులు కలియ తిరుగుతూ ఈ ప్రాంత చారిత్రాత్మక ఆదిమానవ కాలం నాటి చిత్రాలు, గుహలు, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. సందర్శకుల్లో సినీగేయ రచయిత అక్కల చంద్రమౌళి, విశ్రాంత ఉద్యోగులు రాధేశ్యాం, సూర్యనారాయణ, మల్లయ్య, షబ్బీర్‌పాషా, కైలాసం సాగర్ ఉన్నారు.

ఆదర్శం.. ఆలస్యం

సాక్షి విజిట్

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వేసవి సెలవులు ముగిసేలోగా పనులు మరమ్మతులు పూర్తి చేయడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో జిల్లాలో చాలా పాఠశాలల్లో పనులు కొనసా....గుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో కొత్త విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. జిల్లాలో సాగుతున్న పనుల తీరు తెలుసుకునేందుకు 'సాక్షి' చేపట్టిన విజిట్ వివరాలతో ప్రత్యేక కథనం..

- పాఠశాలల్లో నత్తనడకన సాగుతున్న మరమ్మతు పనులు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- గడువులోగా పూర్తి గగనమే



ఎలకేశ్వరం పాఠశాలలో ఫ్లోరింగ్ పనులు చేస్తున్న కూలీలు

హాజీపూర్‌లో...



వేంపల్లిలో కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యుత్, మంచినీటి వసతి, మూత్రశాలలు, మరమ్మతులు తదితర అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. హాజీపూర్ మండలంలో తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్, మంచినీటి వసతి, మూత్రశాలల ఏర్పాటుకు గాను ఒక్కో పాఠశాలకు అంచనా బడ్జెట్ నుంచి 25శాతం నిధులను ఇప్పటికే విడుదల చేశారు. ఈ అభివృద్ధి పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

భీమారంలో...

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీల్లోని 13ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.33లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎలకేశ్వరం పాఠశాలలో ప్రభుత్వం ప్రస్తుతం రూ.3.95లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. భవనం లోపల ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ, మంచినీటి నల్లాల ఏర్పాటు పనులు సాగుతున్నాయి. గుర్తించిన పాఠశాలల్లో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

జన్నారంలో...



జన్నారం: మండలంలో 38పాఠశాలలను ఎంపిక చేయగా పనులు జరుగుతున్నాయి. కలమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పరిశీలించగా కరెంట్, నీటి సౌకర్యం కోసం రూ.2 లక్షలు విడుదలయ్యాయి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో కరెంట్ పనులు నడుస్తున్నాయి. నీటి సౌకర్యం కోసం ఇంకా పనులు చేయాల్సి ఉంది.

జైపూర్‌లో...



జైపూర్: మండల వ్యాప్తంగా 24స్కూళ్లు ఎంపిక చేశారు. విద్యుత్, మూత్రశాలలు, మరుగు దొడ్లు, భవనాల స్లాబ్ రిపేర్స్‌తో పాటు పగుల్లు, చిన్నచిన్న పనులు చేపడుతున్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన సమస్యలు తీర్చేదిశగా అధికారులు పనులు చేపడుతున్నారు. పనుల్లో జాప్యం చోటుచేసుకుంటుంది.

చెన్నూర్‌లో నత్తనడకన...



చెన్నూర్ మండల ప్రాథమిక (హరిజనవాడ) పాఠశాలలో పూర్తి కాని పనులు

చెన్నూర్: నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 10 పాఠశాలల్లో తాగునీటి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఉన్నత, కేజీబీవీ, లైన్‌గడ్డ పాఠశాల భవనాల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. మరో ఆరు పాఠశాలల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు, నాలుగు పాఠశాలల్లో మూత్రశాలల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

అసంపూర్తిగా...



ఎల్లక్కపేటలో అసంపూర్తిగా మరుగుదొడ్లు

చెన్నూర్‌రూరల్: మండలంలో 49 ప్రభుత్వ ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, పది జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మనఊరు–మనబడిలో భాగంగా 23పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతులు, టాయిలెట్లు, వంటషెడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. కానీ అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. అమ్మ, ఆదర్శ పాఠశాలల కింద 43 పాఠశాలలను ఎంపిక చేశారు. కానీ ఆ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి.

పనుల్లో నాణ్యతా లోపం..



కొల్లూర్‌లో అసంపూర్తిగా పనులు

కోటపల్లి: మండలంలో 34 పాఠశాలలు మంజూరు కాగా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గతంలో మనబడి మన పాఠశాల పథకంలో భాగంగా మంజూరైన పాఠశాలలకు కాకుండా మిగితా పాఠశాలలకు నిధులు మంజూరు కాగా అందులో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత లోపిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు.

లక్సెట్టిపేటలో...



లక్ష్మీపూర్ పాఠశాలలో నిర్వహిస్తున్న పనులు

లక్సెట్టిపేట: మండలంలోని 17 ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు మరమ్మతు పనులను చేపట్టారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ రాహుల్ జెండావెంకటాపూర్, లక్ష్మీపూర్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించి వేగవంతం చేయాలని పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారు యాభై శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలుపుతున్నారు. పాఠశాలలో మరమ్మతులు, త్రాగునీరు, డైనింగ్ హాల్, సంపు, ఇతర పనులను నిర్వహిస్తున్నారు.



అసంపూర్తిగా డైనింగ్ హాల్

దండేపల్లిలో సాగుతూ....

దండేపల్లి: మండలంలోని 32 పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. విద్యుత్ మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు, వాటర్ సౌకర్యం కల్పించడం పనులు చేపడుతున్నారు.

అసంపూర్తిగా మన ఊరు–మనబడి..

మన ఊరు–మనబడి పథకంలో దండేపల్లి మండలం లోని 19 పాఠశాలలను ఎంపిక చేశారు. మూడు పాఠశాలల్లో పూర్తయ్యాయి. మిగిలిన అన్ని చోట్ల పనులు అసంపూర్తిగానే మధ్యలోనే నిలిచిపోయాయి.

కార్పొరేట్ హంగులు



దండేపల్లి: మనఊరు–మనబడి పథకంలో దండేపల్లి మండలం పెద్దపేట ప్రాథమిక పాఠశాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. పాఠశాలలో అభివృద్ధి పనులను గతేడాది విద్యాసంవత్సరంలోనే పూర్తిచేశారు. డ్యూయల్ డెస్క్ బెంచీలు, తరగతి గదుల్లో గ్రీన్‌చాక్ బోర్డులు, ప్రతి తరగతి గదిలో విద్యుత్ ఆధునీకరణ పనులు చేపట్టి, లైట్లు, నాలుగు ఫ్యాన్లు, బిగించారు. వాటర్ సౌకర్యం కల్పించారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో...

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కొన్ని నెలల క్రితం ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టిన పనులు నిస్తేజంగా జరుగుతున్నాయి. ఏ ఒక్క ప్రాంతంలోనూ ఇప్పటి వరకు పూర్తి కాలేదు. అక్కడక్కడ నాసిరకంగా పనులు జరుగుతున్నట్లు ఆరోపిస్తుండగా, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లుగా తెలుస్తోంది.

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 8 పాఠశాలల్లో పనులు చేపట్టగా వీటిలో ఒకటి, రెండు చోట్ల పనులు దగ్గర పడగా మిగితా పాఠశాలల్లో మందకొడిగా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొత్త భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వంటగదికి శ్లాబు పడగా గోడలకు ప్లాస్టింగ్, ఇతర పనులు జరగాల్సి ఉంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనులు పూర్తయ్యాయి. ఇతర పాఠశాలల్లో మరుగుదొడ్లు, కిచెన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నత్తనడకన అభివృద్ధి పనులు...

బెల్లంపల్లి మండలం గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేపట్టిన అభివద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండల పరిధిలో 30ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో 20పాఠశాలల్లో మరమ్మతు, ఇతర అభివద్ధి పనులు చేపట్టారు. చర్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అభివద్ధి పనులు నాసిరకంగా, నత్తనడకన సాగుతున్నాయి.



అసంపూర్తిగా బెల్లంపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

నాసిరకం ఇసుకను వినియోగిస్తున్నారు. ఇష్టారీతిన పనులు చేపడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్ర శాలలకు నీటి సౌకర్యం లేదు. కిచన్ షెడ్ల నిర్మాణాల ఊసే లేకపోయింది.అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ఆలస్యంగా సాగుతున్నాయి.

వేగం పుంజుకోని పనులు...

తాండూర్ మండలంలో 39పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపడుతున్నారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల మైనర్, మేజర్ రిపేర్లు, కిచెన్ షెడ్ల నిర్మాణాలు, ఎలక్ట్రిసిటీ పనులు నెలల తరబడి జరుగుతున్నా, ఇంకా తుది దశకు రాలేదు. భూమి సమస్యతో పెగడపల్లిలో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. తాండూర్ ఉర్దూమీడియం, తాండూర్ మండల పరిషత్ పాఠశాలల్లో జరుగుతున్న పనుల్లో వేగం కనిపించడం లేదు. గోపాల్‌నగర్, రేచినీ, బారేపల్లి మండల పాఠశాలల పనులు నూతన హంగులతో ఆధునీకరించారు.

అంతంత మాత్రంగా పనులు

కాసిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో



కాసిపేట మండలం గోండుగూడ పాఠశాలలో జరుగుతున్న పనులు

మరమ్మతుల పనులు అంతంత మాత్రంగా సాగుతున్నాయి. నిధులు వస్తాయా.. రావా అనే అనుమానాలతో సదరు నిర్వాహకులు ఆలోచనలో పడ్డారు. మన ఊరు మనబడికి ఎంపికైన పాఠశాలలు మినహ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం మండలంలో 32ఉండగా అందులో దుబ్బగూడెం మినహ 31పాఠశాలలకు పనులు మంజూరయ్యాయి. పాఠశాలల్లో టాయిలెట్స్, విద్యుత్, తాగునీరు, చిన్నచిన్న మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా పనులు నడుస్తున్నాయి. లంబాడితండా పాఠశాలలో పనులు పూర్తికావడంతో ప్రైవేట్ పాఠశాలను తలపించేలా గదులు, డైనింగ్‌హాల్ రూపుదిద్దుకున్నాయి.

నిర్మాణ దశలోనే పాఠశాల పనులు

భీమిని, కన్నెపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు చేపడుతున్నారు. కన్నెపల్లి మండలం ఆనందాపూర్ మండల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.3.50లక్షలతో నీటి సౌకర్యం, మైనర్ రిపేర్లు, మరుగుదొడ్లు, విద్యుత్ మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయి.

పాత కిచెన్‌ల రిపేరు పనులు..



బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి పాఠశాలలో...

వేమనపల్లి మండలంలో 33పాఠశాలలు ఉండగా మన ఊరు మన బడి కింద 11 పాఠశాలలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 22 పాఠశాలలను ఎంపిక చేశారు. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు పూర్తి కాగా పేయింటింగ్ దశలో ఉన్నాయి. 22 పాఠశాలలకు మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిషన్ పనులు, తాగునీటి సౌకర్యం కోసం నిధులు కేటాయించారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా కిచెన్ షెడ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. పాత వాటినే రిపేర్ చేయిస్తున్నారు.

నత్తే నయం .....

నెన్నెల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు నత్తనడక నేర్చే రీతిలో సాగుతున్నాయి. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ కింద 21 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలలకు రూ.70లక్షల నిధులు మంజూరయ్యాయి. విద్యుత్‌కు సంబంధించిన పనులు పూర్తి కాగా బాలికల మరుగుదొడ్లు, తాగునీటి పనులు కొనసాగుతున్నాయి. క్లాస్ రూమ్‌లలో మరమ్మతులు, పేయింటింగ్ పనుల ఊసే లేదు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాలటౌన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల చేస్తున్న సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నూర్: పట్టణంతో పాటు మండలంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిర్వహిస్తుండడంతో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

భీమారం: మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కుమార్ తెలిపారు. చెన్నూర్ సమీపంలోని 132 సబ్‌స్టేషన్ నుంచి భీమారంలోని 33కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

నెన్నెల: మండలంలోని నెన్నెల, ఆవుడం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిల్‌పేట్ నుంచి ఆవుడం వరకు, మాల గురిజాల నుంచి నెన్నెల వరకు 33 కేవీ లైన్‌లలో మరమ్మతులు, తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

కాసిపేట: మండలంలోని కోమటిచేను, దేవాపూర్, ధర్మరావుపేట ఫీడర్‌లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కాసిపేట, చిన్నధర్మారం, ముత్యంపల్లి, సోనాపూర్ గ్రామాలు మినహా మిగితా అన్ని గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

వేమనపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. కన్నెపల్లి ఫీడర్ నందు 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామ్మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

నియామకం

పాతమంచిర్యాల: తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లికి చెందిన కాంపెల్లి చరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు తెలిపారు.

డంపింగ్ యార్డులను వినియోగించాలి

లక్సెట్టిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రణాళికతో చెత్త డంపింగ్ యార్డులను వినియోగించాలని ఎంపీడీవో సరోజ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిరంతరం డ్రై వేస్ట్, వెట్ వేస్ట్ కలెక్షన్ జరిగేలా చూడాలన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాదన మహోత్సవం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని విశ్వకర్మ దేవాలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాదన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు.

యూనిఫాం సకాలంలో అందేలా చూడాలి

జన్నారం: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థుల యూనిఫాంలను కుట్టించే బాధ్యతను ఐకేపీ, మహిళా సంఘాలకు అప్పగించారని, యూనిఫాంలు త్వరగా కుట్టి సకాలంలో అందేలా చూడాలని ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. కుట్టు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు.

కుట్టు కేంద్రాలు ప్రారంభం

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట, చందారం, జెండావెంకటాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో సరోజ శక్తి కుట్టు కేంద్రాలను ప్రారంభించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు దుస్తులు అందించాలని సూచించారు.



కన్యకాపరమేశ్వరికి పూజలు

చెన్నూర్/దండేపల్లి/మంచిర్యాలటౌన్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో, దండేపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, చెన్నూర్ పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో వేడుకలు నిర్వహించారు. కుంకుమార్చన పూజలు చేశారు.



విశ్వనాథ ఆలయంలో కుంకుమ పూజలు

క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని నంనూర్ గ్రామంలో శనివారం దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం రాష్ట్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జునగరి దుర్గయ్యతో పాటు కళాకారుల బృందం పాల్గొన్నారు.